

71 బస్తాల బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - సీతంపేట
మండలంలోని మెట్టుగూడ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 71 బస్తాల పిడిఎస్ బియ్యాన్ని ఎస్ఐ నీలకంఠం పట్టుకున్నారు. పాలకొండ డిఎస్‌పి జివి కృష్ణారావుకు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు ఎస్ఐ తన సిబ్బందితో వెళ్లి పట్టుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసి పట్టుబడిన బియ్యం బస్తాలను సివిల్ సప్లై గోదాంకు తరలిస్తున్నట్లు తెలిపారు.


పోలీసులు పట్టుకున్న బియ్యం బస్తాలు

అధికార పార్టీలో.. వ్యతిరేక కుంపటి

- ప్రభుత్వ తీరుపై రగిలిపోతున్న సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో చుక్కలు చూపించేందుకు యత్నం
- పిడిఎఫ్ అభ్యర్థికి అనుకూల పవనాలు

అధికార పార్టీలో మొదలైన వ్యతిరేక కుంపటి రోజురోజుకూ రాజుకుంటోంది. ప్రభుత్వ తీరుపై అధికార పార్టీకి చెందిన సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు రగిలిపోతున్నారు. వచ్చే నెల 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో చుక్కలు చూపించేందుకు కారాలు మిరియాలు నూరుతున్నారు. తమ వరకూ వస్తే తగ్గేదేలే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. మరోవైపు టిడిపి మద్దతుతో నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థి, ఆ పార్టీ గురించి చెప్పుకునేందుకు కూడా సాహసించడం లేదు. ఇవన్నీ పిడిఎఫ్ అభ్యర్థికి అదనపు బలంగా మారుతున్నాయి.



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి
కాస్త సమయం అటు ఇటు అయినా సర్పంచులు, ఎంపిటిసి ఎన్నికలు జరిగి సుమారు రెండేళ్లు కావస్తోంది. ఎప్పటి మాదిరిగానే అధికార పార్టీ మద్దతుదారులే ఎక్కువగా గెలిచారు. వీరంతా తమ హయాంలో గ్రామాలను, ప్రాదేశిక నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తామని ప్రజలకు మాటిచ్చారు. ఎంతో కొంత అభివృద్ధి చేయాలని కలలు కన్నారు. కానీ, ఆశలు నెరవేర్చేందుకు ప్రభుత్వం ఏమాత్రమూ సహకరించని పరిస్థితి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న నవరత్నాలు గానీ, ఇతర సంక్షేమ పథకాలు గానీ సర్పంచులు, ఎంపిటిసిలకు సంబంధం లేకుండానే అమలవుతున్నాయి. మరోవైపు గ్రామ స్వరాజ్యమే ధ్యేయమంటూ ఏర్పాటుచేసిన గ్రామ సచివాలయ వ్యవస్థలో సర్పంచుల పాత్ర ఏమీ లేదు. చాలాచోట్ల అక్కడి సిబ్బంది సర్పంచులు, ఎంపిటిసిల మాట వినే పరిస్థితి కూడా లేదు. రెండేళ్ల క్రితం వరకు పంచాయతీ కార్యాలయానికి వచ్చే పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఒలు కూడా మొహం చాటేశారు. పోనీ, సచివాలయంలో కూర్చుందామంటే సర్పంచ్‌కి చోటే లేకుండా పోయింది. ఇంకోవైపు ప్రభుత్వంపై ఆశ, నమ్మకంతో చేపట్టిన గ్రామ సచివాలయ భవనాలు, ఆర్‌బికెలు, వెల్‌నెస్ సెంటర్లు, బల్క్‌మిల్క్ సెంటర్ల నిర్మాణ పనులకు బిల్లులు ఇవ్వడం లేదు. దీంతో, ఇటు రాజకీయంగా, అటు ఆర్థికంగా గ్రామ సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు సతమతమౌతున్నారు.

కాలిన పుండుపై కారం చల్లినట్టుగా స్థానిక సంస్థలకు రావాల్సిన నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయడం లేదు. ఉమ్మడి విజయనగరం జిల్లాకు 2022-23 ఆర్థిక సంఘానికి సంబంధించి మండల, జిల్లా పరిషత్తులకు 15 శాతం చొప్పున రూ.40 కోట్లు, గ్రామ పంచాయతీలకు 70 శాతం చొప్పున సుమారు రూ.93 కోట్ల మేర రావాల్సి ఉంది. ఇప్పటి వరకు ఒక్కపైసా కూడా విడుదల కాలేదు. దీంతో పారిశుధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వలేని పరిస్థితి. విద్యుత్తు బకాయిల కోసం వేధింపులు ఎదుర్కోవాల్సిన దుస్థితి దాపురించింది. ఇక గ్రామ స్థాయిలో రోడ్ల నిర్మాణంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఫ్రీజింగ్ విధించాయి. ఈ నేపథ్యంలో మెజార్టీ సర్పంచులు, ఎంపిటిసి, జెడ్‌పిటిసి సభ్యులు లోలోపల మదన పడుతున్నారు. పవరూ లేక, పైసలూ రాక ప్రజలకు ఏమేరకు మేలు చేయగలమంటూ వారంతా చర్చించుకుంటున్నారు. ఇటువంటి తరుణంలో వచ్చిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ తరపున పోటీచేస్తున్న అభ్యర్థిని గెలిపించాలని ఒత్తిడి చేయడంతో వీరంతా జీర్ణించుకోలేకపోతున్నారు. ఇప్పటి వరకు ఏం చేశామని పట్టభద్రులను ఓట్లు అడగగలమని మదనపడుతున్నారు.

మరోవైపు ప్రతిపక్ష టిడిపి బలపర్చిన అభ్యర్థి ఆ పార్టీ గురించి ఎక్కడా ప్రస్తావించేందుకు కూడా సాహసించలేని పరిస్థితి దాపురిస్తోంది. పార్టీ గురించి ప్రస్తావిస్తే ఎక్కడ ఓట్లు పోతాయోనన్న భయంతో వ్యక్తిగతంగా ఓట్లు అభ్యర్థించుకోవాల్సిన పరిస్థితి. ఆయన వ్యక్తిగతంగా చెప్పుకోవడానికి కూడా ఏమీ లేదు. ఇవన్నీ పిడిఎఫ్ బలపర్చిన కోరెడ్ల రమాప్రభకు అనుకూల పవనాలు కనిపిస్తున్నాయి. విద్యావంతురాలు, మేధావి, అంతకు మించి సుమారు 250 ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజాసంఘాలు బలపర్చిన అభ్యర్థి కావడంతో అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు సైతం ఆమె వైపే చూస్తున్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ శర్మ, హాజరైన పలు కార్మిక సంఘాల నేతలు

ఉత్తరాంధ్ర సమస్యలపై గళమెత్తే.. కోరెడ్ల రమాప్రభను గెలిపించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)
ఉత్తరాంధ్ర అభివృద్ధికి, ప్రభుత్వ రంగ పరిశ్రమల రక్షణకు 250 ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను శాసన మండలి ఎన్నికల్లో గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం విశాఖలోని జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో వివిధ ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కార్మిక సంఘాల నాయకులతో ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కె.రమాప్రభ ముఖాముఖి నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర వెనుకబాటు సమస్య పరిష్కారం కోసం ఏ ఒక్క పార్టీ నేడు కృషి చేయడం లేదన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిపై వైసిపి ప్రభుత్వం కక్ష కట్టిందని తెలిపారు. ఆరేళ్లుగా శాసన మండలిలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ మాధవ్ ఈ ప్రాంత అభివృద్ధిపై మాట్లాడింది ఏమీ లేదన్నారు. ఆయన ప్రతిపక్ష ఎమ్మెల్యే అయినప్పటికీ అధికార పక్షానికి వంత పాడుతూ కాలం గడిపారని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో ఉత్తరాంధ్ర సమస్యలపై మండలిలో గళమెత్తి నిజాయితీగా పనిచేసే ప్రజా ప్రతినిధిని ఎన్నుకోవాల్సిన అవసరముందన్నారు. మూడు దశాబ్దాలుగా ప్రజా జీవితంలో ఉన్న పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలన్నారు. ప్రభుత్వరంగ పరిశ్రమల్లోని ఉద్యోగులంతా అందుకు గట్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర వెనుకబాటుతనంపై శాసన మండలిలో ప్రశ్నించే, నిలదీసే గొంతు ఉండాలంటే రమాప్రభను గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ కోరెడ్ల రమాప్రభ మాట్లాడుతూ ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ అమలు కోసం, విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌తో సహా ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడం కోసం, సిపిఎస్ రద్దు కోసం, కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ కోసం, ప్రైవేట్ విద్యా సంస్థల ఉద్యోగుల, ఉపాధ్యాయులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు కోసం, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ కోసం తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో స్టీల్ సిఐటియు నాయకులు జె.అయోధ్యరామ్, స్టీల్ ఎఐటియుసి నాయకులు జె.రామకృష్ణ, బిహెచ్ఇఎల్ యూనియన్ నాయకులు జిటిపి.ప్రకాష్ సహా ఎస్.ప్రసాద్ (షిప్ యార్డ్), పిఇసిహెచ్‌వి.సాగర్ (బిఎస్ఎన్ఎల్), పడాల రమణ (ఎఐటియుసి), లక్ష్మణరావు (విశాఖ పోర్టు), పిట్టా నారాయణమూర్తి (జింక్ ఎంప్లాయీస్ యూనియన్), బిబి.గణేష్ (ఎల్ఐసి), పలువురు హెచ్‌పిసిఎల్, డాక్‌యార్డ్ యూనియన్ల నాయకులు, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కార్యదర్శి ఎస్.జ్యోతీశ్వరరావు పాల్గొన్నారు.

టిడిపిలో పెంట... గుమ్మిడికి తప్పని తంటా

నియోజకవర్గంలో పార్టీ బలోపేతంపై దృష్టి

ప్రజాశక్తి - సాలూరు
మక్కువ మండలం టిడిపి మాజీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు పెంట తిరుపతిరావు కొద్దిరోజుల క్రితం టిడిపి గూటికి చేరారు. ఆపార్టీ అధినేత చంద్రబాబునాయుడు సమక్షంలో అమరావతిలో ఆయన చేరిపోయారు. గత ఎన్నికల్లో టిడిపి ఓడిపోయిన తర్వాత పెంట తిరుపతిరావు బిజెపి తీర్థం పుచ్చుకున్నారు. ఆ పార్టీ మన్యం జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ దేవ్‌కు ప్రధాన అనుచరుడైన పెంట తిరుపతిరావు మక్కువ మండలంలో ప్రధాన సామాజిక వర్గానికి చెందిన నాయకుడు. అంగ, అర్థబలం పుష్కలంగా ఉన్న పెంట బిజెపిలో చేరినప్పటికీ తగిన ప్రాధాన్యత లభించకపోవడంతో తిరిగి టిడిపి గూటికి చేరాలని తీవ్రంగా ప్రయత్నించారు. అయితే నియోజకవర్గ ఇన్చార్జి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యురాలు సంధ్యారాణి ఆయన చేరికను ఇంతవరకూ అడ్డుకున్నారనే వాదనలు వినిపించాయి. పెంట చేరికను మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ దేవ్ స్వాగతించినా సంధ్యారాణి తీవ్రంగా ప్రతిఘటించారు. ఇటీవల బిజెపికి రాజీనామా చేసిన మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణతో పాటు పెంట తిరుపతిరావు కూడా 'టిడిపి'లో చేరిపోయారు. తిరుపతి రావుకు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడుతో సత్సంబంధాలు ఉండడం, సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ దేవ్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పెంటకు లైన్ క్లియర్ అయింది. నియోజకవర్గ ఇన్‌ఛార్జి సంధ్యారాణి వ్యతిరేకించినా తిరుపతిరావును పార్టీలో చేర్చుకోవడం ద్వారా అధిష్టానం ఆమె మాటకు పెద్ద గా ప్రాధాన్యత ఇవ్వలేదని స్పష్టమవుతోంది. ఇప్పటికే భంజ్‌దేవ్ అనుచరులను పార్టీ కార్యక్రమాల్లో సంధ్యారాణి కలుపుకొని వెళ్లడం లేదనే ప్రచారం జరుగుతోంది. పాచిపెంట మండల పార్టీ అధ్యక్షులు పిన్నింటి ప్రసాద్‌బాబు పార్టీ కార్యక్రమాలకు దూరంగా వుంటున్నారు. ఆ మండల ంలో పిన్నింటికి వ్యతిరేకంగా ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని సంధ్యారాణి తయారు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై పిన్నింటి కుటుంబీకులు గుర్రుగా ఉన్నారు. తాజాగా మక్కువ మండలం లోనూ ఆమెకు వ్యతిరేకంగా బలమైన గ్రూపు ఏర్పడే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఒక వేళ సంధ్యారాణి రానున్న ఎన్నికల్లో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తే పెంట తిరుపతిరావు గ్రూపు ఏమేరకు ఆమెకు సహకరిస్తారనేది ప్రశ్నార్థకంగా మారుతోంది. ఇంకోవైపు సీనియర్ నాయకులు తిరుపతిరావు ఆధ్వర్యాన సంధ్యారాణి వ్యతిరేక కూటమి నాయకులు కొత్త అభ్యర్థిని పోటీకి దింపాలని అధిష్టానానికి సంకేతాలు పంపుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. అయితే భంజ్‌దేవ్‌ను అభ్యర్థిగా ఎంపిక చేయాలని, లేకపోతే కొత్త అభ్యర్థిని బరిలోకి దింపాలని వారు అధిష్టానంపై ఒత్తిడి పెంచుతున్నారనే ప్రచారం సాగుతోంది. ఏమైనా నియోజకవర్గ టిడిపి రాజకీయాల్లో మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్ అనుకూల కూటమి బలోపేతం కావడం సరికొత్త సమీకరణాలకు నాంది పలకనుందనే చర్చ మొదలైంది.

పబ్లిక్ పరీక్షలకు దోహదం


ప్రజ్ఞా వికాస పరీక్షకు విశేష స్పందన


పార్వతీపురం పరీక్షా పత్రాలు విడుదల చేస్తున్న ప్రముఖ న్యాయవాది జోగారావు, కాలేజీ అధ్యాపకులు, ఎస్ఎఫ్ఐ యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి -కలెక్టరేట్
రానున్న టెన్త్ పబ్లిక్ పరీక్షలకు ప్రజ్ఞా వికాసం పరీక్ష విద్యార్థులకు ఎంతో దోహదపడుతుందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన ప్రజ్ఞా వికాస పరీక్షకు అనూహ్య స్పందన లభించింది. ఈ పరీక్షల్లో సుమారు 3,500మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో భాగంగా పార్వతీపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన పరీక్షకు తొలుత ప్రముఖ న్యాయవాది జగ్గారావు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాజు, సింహాచలం, నాయకులు టి.ధనుజయ్, కె.రాజేంద్ర పరీక్షా పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా న్యాయవాది జోగారావు ప్రపంచీకరణ విధానాలకు లోబడకుండా భవిష్యత్తు లక్ష్యసాధనకై విద్యార్థులు కృషి చేయాలన్నారు. గిరిజన ప్రాంతంలో విద్యకు దూరంగా ఉన్న విద్యార్థులకు విద్యను అందించేలా విద్యార్థుల ఆలోచన మెరుగుపడాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె.రాజు, హెచ్.సింహాచలం మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ విద్యార్థుల, విద్యారంగ సమస్యలతో పాటు విద్యార్థుల నైపుణ్యతను పెంచి, భవిష్యత్తులో ఉన్నత చదువులను ప్రోత్సహించేలా ప్రజ్ఞా వికాసం పరీక్ష నిర్వహిస్తుం దన్నారు. యుటిఎఫ్ జిల్లా కోశాధికారి కె.మురళి మాట్లాడుతూ పరీక్షల్లో విద్యార్థులు ఎటువంటి భయాందోళనకు గురికాకుండా ఏకదృష్టితో మంచి ఉత్తీర్ణత సాధించాలని, ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకులు శర్మ, ఎస్ఎఫ్ఐ అధ్యక్షులు కె.సరోజిని, ఉపాధ్యక్షులు లలిత, కమిటీ సభ్యులు నవీన్, స్వాతి, ధనుంజయ్, మరియా, స్వర్ణ, ఈశ్వర్, సంధ్య, చిన్నారి పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో ప్రజ్ఞావికాస పరీక్ష స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. పరీక్షా కేంద్రంలో గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు కోలక అవినాష్ కుమార్, పి.రాజశేఖర్, బి.కూర్మారావు, ఎస్ఎఫ్ఐ గుమ్మలక్ష్మీపురం మండల కార్యదర్శి గంగారావు పరీక్ష పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్రకార్యవర్గ సభ్యులు కె.అవినాష్ మట్లాడుతూ టెన్త్ విద్యార్థులకు రాబోయే పబ్లిక్ పరీక్షలకు ఈ ప్రజ్ఞ వికాస పరీక్ష దోహదపడుతుందన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రాజశేఖర్ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ విద్యార్థుల, విద్యారంగ సమస్యలతో పాటు విద్యార్థుల నైపుణ్యతను పెంచి, భవిష్యత్తులో ఉన్నత చదువులకు ప్రోత్సహించేలా ఈ పరీక్షలు నిర్వహిస్తుందన్నారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బి.కూర్మారావు మాట్లాడుతూ పరీక్షల్లో ఎటువంటి భయాందోళనకు గురికాకుండా ఏకదష్టితో మంచి ఉత్తీర్ణత సాధించాలని, ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. కార్యక్రమం లో యుటిఎఫ్ నాయకులు ప్రసాద్, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు ఎ.గంగారావు, ఉపాధ్యక్షులు మహేష్, మండల కమిటీ సభ్యులు గణేష్, అనిల్, దిలీప్, అవినాష్‌పాల్గొన్నారు.

సాలూరు : పట్టణం, మండలంలోని దీప్తి, భాష్యం, కొత్తవలస, అంటి వలస, కురుకుట్టి, పలు కేంద్రాల్లో ప్రజ్ఞా వికాస పరీక్ష జరిగింది. సాలూరులోని దీప్తి స్కూల్‌లో పట్టణ ఎఎస్ఐ శ్రీనివాసరావు, పాఠశాల కరస్పాండెంట్ కాశీ, యుటిఎఫ్ జిల్లా నాయకులు కె.జానకిరావు, సీనియర్ నాయకులు ఎవి రామారావు (రమేష్‌మాస్టారు), సభ్యులు కోలక లీల, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.పండు, మండల ఇన్‌ఛార్జి వరణ్ పరీక్షా పేపర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎఎస్ఐ మాట్లాడుతూ ఇలాంటి చైతన్యవంతమైన కార్యక్రమాలు ఎస్ఎఫ్ఐ మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు. . కార్యక్రమలో ఎస్ఎఫ్ఐ నాయకులు పూలు, మహేష్, రామ్, మల్లేష్, రామకష్ణ, పాల్గొన్నారు.


గుమ్మలక్ష్మీపురంలో పరీక్షా పత్రాలను విడుదల చేస్తున్న నాయకులు


సాలూరులో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఎస్.కోట బాలుడికి స్థానం

ప్రజాశక్తి-శృంగవరపుకోట
శృంగవరపుకోట పట్టణానికి చెందిన తేతల భాను ప్రకాశ్‌రెడ్డి, సాయి శివానీల కుమారుడు తేతల సంజీవ్ రెడ్డి(4)కి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు లభించింది. 30 సెకన్లలో దేశంలోని 28 రాష్ట్రాల పేర్లను రాజధానులతో సహ చెప్పడం ద్వారా సంజీవ్ అర్హత సాధించాడు. ఈ మేరకు సంజీవ్‌ను అభినందిస్తూ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ నుంచి ధ్రువపత్రం, బంగారు పతకం, పుస్తకం, కలం బహుమతిగా అందజేశారు. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించిన సంజీవ్‌ని స్థానికులు, నాయకులు అభినందించారు.



పెట్రోల్ బంకుల్లో దోపిడీ

- పట్టించుకోని అధికారులు
- నష్టపోతున్న వినియోగదారులు

ప్రజాశక్తి-పాలకొండ/పాలకొండ రూరల్
మానవ జీవితంలో పెట్రోల్ నిత్యావసర వస్తువుగా మారిపోయింది. ద్విచక్రవాహనాలు, ఇతర వాహనాల సంఖ్య పెరిగే కొద్ది పెట్రోల్ బంకుల్లో తేడాలు కూడా అదేస్థాయిలో సాగుతున్నాయి. దీనివల్ల వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. జిల్లాలో అనేక పెట్రోల్ బంకుల్లో అంతర్గతంగా ఏర్పాటు చేసుకున్న కొలతల ద్వారా పరిస్థితి దయనీయంగా మారుతుంది. ఎక్కువ శాతం పెట్రోల్ బంకుల్లో పెట్రోల్, డీజిల్ నాణ్యతా పరీక్షకు సంబంధించి పరికరాలు అందుబాటులో ఉండడం లేదు. కనీస సౌకర్యాలు లేవు. పెట్రోల్ బంకుల్లో జరిగే మోసాలను వినియోగదారులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లాలో గల 42 పెట్రోల్ బంకులపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీంతో యథేచ్ఛగా రీడింగ్ మీటర్‌ను ట్యాంపరింగ్ చేస్తూ కొన్ని బంకుల యాజమాన్యాలు వాహనదారులను దోచుకుంటున్నాయి. ఎన్నోసార్లు పెట్రోల్ బంకు నిర్వాహకులు చేస్తున్న అక్రమాలను వాహనదారులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా నామమాత్రంగా చర్యలు తీసుకోవడం, ఆ తరువాత అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో విచ్చలవిడిగా పెట్రోల్ దోపిడీ చేస్తున్నారని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో పెట్రోల్ బంకుల ద్వారా రోజుకు లక్షల లీటర్ల పెట్రోల్, డీజిల్ విక్రయాలు జరుగుతున్నాయి. అయితే పౌరసరఫరాల శాఖ, తూనికలు, కొలతలు శాఖ, రెవెన్యూ విభాగాలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. ఆర్‌డిఒలు, తహశీల్దార్లు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలి. అయితే ఆ శాఖాధికారులు ఇతర కార్యకలాపాల్లో నిమగ్నమవుతూ తమకు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. పౌరసరఫరాల శాఖాధికారులు కనీస సౌకర్యాలు, కల్తీ వంటి వాటిపై నిఘా లేకపోవడంతో నిబంధనలకు పాతర పడుతుంది.

కానరాని సౌకర్యాలు....

జిల్లాలో చాలా బంకుల్లో కనీస సౌకర్యాలు ఎక్కడా కానరావడం లేదు. నిబంధనల ప్రకారం తాగునీరు, గాలినింపే యంత్రాలు, మరుగుదొడ్డి, విశ్రాంతి తీసుకునేందుకు వసతి ఏర్పాటు చేయాలి. ఈ మేరకు సెస్ వసూలు జరుగుతుంది. వాహనాలకు ఉచితంగా గాలినింపే పరికరాలు తప్పనిసరి. టైర్లలో గాలి ఒత్తిడి సరిగా లేకపోవడంతోనే ఇంధనం అధికంగా వినియోగం అవుతుంది. 24 గంటలు బంకులు నిర్వహించాల్సి ఉండగా ఎక్కడా అమలు కావడం లేదు.

నిబంధనలకు పాతర....


తూనికలు, కొలతల శాఖాధికారులు ప్రతి సంవత్సరం తూకాలను పరిశీలించి సీల్‌చేస్తారు. కంపెనీల ప్రతినిధులు కూడా కొలతలను పరిశీలించాలి. అన్ని పెట్రోల్ బంకుల్లో డీలర్ పేరు, ఫోన్ నెంబర్, డిఎస్ఒ సెల్‌ఫోన్ నెంబర్, వెబ్‌సైట్ అడ్రస్, టోల్‌ఫ్రీ నెంబర్ వినియోగదారులకు కనిపించేలా ఉండాలి. అన్ని బంకుల్లో హైడ్రోమీటర్, ఫిల్టర్ పేపర్, ఐదు లీటర్ల క్యాన్‌లు సిద్ధంగా ఉంచాలి. అనేక చోట్ల అందుబాటులో ఉంచడం లేదు. బంకుకు సంబంధించిన భూమి వివరాలు, లీజ్ అగ్రిమెంట్, పట్టణంలో అయితే మున్సిపల్ అనుమతులను రెవెన్యూశాఖ పరిశీలించాల్సి ఉంటుంది. పౌరసరఫరాల శాఖ సరైన వసతులు, నాణ్యతా ప్రమాణాలు తనిఖీ చేయాలి. వాణిజ్య పన్నుల శాఖ వ్యాట్, వివిధ రకాల పన్నులను చూసి అనుమతించాలి. అగ్ని మాపకశాఖ ప్రమాదాల నివారణ చర్యలను పరిశీలించాల్సి ఉంటుంది. ఆయా శాఖల్లో సిబ్బంది కొరత నేపథ్యంలో పూర్తిస్థాయిలో పర్యవేక్షణ కొరవడిందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

జాగ్రత్తలు పాటించాలి....

వినియోగదారులు డీజిల్, పెట్రోల్ వేయించుకునే సమయంలో తప్పనిసరిగా మీటర్ సున్నాలో ఉందో లేదో చూసుకోవాలి. మీటర్ రీడింగ్‌ను పరిశీలిస్తూ పెట్రోల్, డీజిల్ వేయించుకోవాలి. పెట్రోల్ పోయించుకోవాలంటే 50, 100 అని రౌండ్ ఫిగర్ పోయించుకోరాదు. బంక్ సిబ్బంది ముందుగా తక్కువ కొలతలతో ఫీడ్ చేసే అవకాశం ఉంది. ఖాళీ బాటిళ్లలో పెట్రోల్ పోయించుకుంటే కొంతవరకు ఇటువంటి మోసాలను అరికట్టడానికి అవకాశం ఉంటుంది.

కనకమహాలక్ష్మమ్మ ఆలయం కిటకిట

గరివిడి : చీపురుపల్లిలోని కనక మహాలక్ష్మి అమ్మవారు 25వ జాతరకు ఆదివారం జనం పోటెత్తారు. వేల సంఖ్యలో యాత్రికులు తరలిరావడంతో ఆలయం వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్లు కిటకిటలాడాయి. విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ కుటుంబ సమేతంగా ఆలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ కుమార్తె మజ్జి సిరిసహస్ర వివాహ ఆహ్వాన పత్రికను అమ్మవారికి సమర్పించారు. ఈ మేరకు ఆలయ ఇఒ గొలుగుల శ్రీనివాస్ చైర్మన్‌కు సాలువా కప్పి అమ్మవారి ఫొటోను అందజేశారు. ఎంపి బెల్లాన చంద్రశేఖర్ దంపతులు పూజలు చేశారు. ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలను జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో చీపురుపల్లి, గరివిడి ఎంపిపిలు ఇప్పిలి వెంకటనరసమ్మ, మీసాల విజయలక్ష్మి , చీపురుపల్లి జెడ్‌పిటిసి వలిరెడ్డి శిరీష, ఇప్పిలి అనంత్, ఆలయ కమిటీ అధ్యక్షులు ఇప్పిలి గోవింద్, ఆలయ కార్యదర్శి సూర్యకుమార్, మీసాల విశ్వేశ్వరరావు, వలిరెడ్డి లక్ష్మణ పాల్గొన్నారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి బొత్స


రాజన్నకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అంధవరపు కోటేశ్వరరావు, శెట్టి నాగేశ్వరరావు


రాజన్న దొరను కలిసిన శెట్టి, అంధవరపు

కురుపాం : ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పి.రాజన్నదొరను సాలూరులో తన నివాసం వద్ద ఆదివారం వైసిపి (గ్రీవెన్స్) సెల్ జిల్లా అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, వైసిపి వాణిజ్య విభాగ జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కురుపాం నియోజకవర్గ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని కోరామని, వైసిపి ప్రభుత్వంలో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందని అనడానికి నిదర్శనం తామేనని అన్నారు. తాము పార్టీలో కష్టపడి పనిచేసినందుకు తమ సేవలను గుర్తించి అధిష్టానం తమకు ఇటీవల పార్టీ అనుబంధ కమిటీల్లో జిల్లా అధ్యక్షులుగా స్థానం కల్పించిందని అన్నారు. అందుకు ప్రత్యేకంగా ముఖ్యమంత్రి గుర్తించిన ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణికి, ఉపముఖ్యమంత్రి రాజన్నదొరకు కృతజ్ఞతలు తెలుపుతూ వారి సూచనలు, సలహాలు పాటిస్తూ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి విద్యార్థి విభాగ జిల్లా అధ్యక్షులు ఆరిక సుబుద్ధి పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ షణ్ముఖరావు

క్రీడల్లో యువత రాణించాలి

గుమ్మలక్ష్మీపురం : క్రీడల్లో యువత రాణించాలని ఎల్విన్‌పేట ఎస్ఐ షణ్ముఖరావు అన్నారు. మండలంలోని కొండవాడలో యువత ఆధ్వర్యంలో జరుగుతున్నటువంటి మెగా క్రికెట్ టోర్నీ నీ ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత విద్యతో పాటు క్రీడల్లోన రాణించాలని, క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి ఎంతగానో దోహదపడతాయని అన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మొదట బహుమతి రూ.22,000, ద్వితీయ బహుమతి రూ.11000 నగదును అందజేయడం జరుగుతుందని ఆసక్తి గల టీములు టోర్నీలో పాల్గొనవచ్చని అన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ ఫిజికల్ చంద్రమోహన్, గ్రామయువత, పెద్దలు పాల్గొన్నారు.


ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

అపూర్వ కలయిక

వీరఘట్టం : ఏయ్... నీవు ఏం చేస్తున్నావ్? ఎక్కడున్నావ్? ఎలా ఉన్నావ్ మీ వారు ఏం చేస్తున్నారు.. పిల్లలు ఏం చేస్తున్నారు... అని ఒకరికొకరు పలకరించుకున్నారు. పాతజ్ఞాపకాలన్నీ ఒక్కసారి నెమరువేసుకున్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో 1982-83 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఇక్కడకు చేరుకోవడంతో ఈ ప్రాంతమంతా పండగ వాతావరణంలా నెలకొంది. వివిధ ప్రాంతాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు ఇక్కడకు చేరుకొని వారి, వారి సుఖ సంతోషాలు చెప్పుకొని సంతోషంగా గడిపారు. అప్పటి గురువులను ప్రత్యేకంగా పూజించి సాలువాలతో ఘనంగా సత్కరించారు. అంతకుముందు అప్పటి గురువులను ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ఊరేగింపుగా ప్రధాన రహదారి మీదుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణకు చేరుకున్నారు. అనంతరం కుటుంబ సమేతంగా భోజనాలు ఆరగించి, పిల్లా పాపలతో సంతోషంగా గడిపారు.


ఏనుగులు చెల్లాచెదురు చేసిన వరికుప్పలు

వరికుప్పలను ధ్వంసం చేసిన ఏనుగులు

వీరఘట్టం: మండలంలోని కిమ్మి సమీపాన పరిధిలోనే గత 10 రోజులుగా సంచరిస్తున్న ఏనుగుల గుంపు ఆదివారం అదే గ్రామానికి చెందిన రైతు త్రినాధకు చెందిన ఎకరా పొలంలో ఉన్న వరి దిబ్బలను ధ్వంసం చేశాయి. ఆరుగాలం కుటుంబంతా ఎంతో శ్రమించి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని పంటను సాగు చేసినప్పటికీ ఏనుగులు సంచార కారణంగా పంట అంతా నేల పాలు కావడంతో రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏనుగులు సంచార కారణంగా కంటిమీద కునుకు లేకుండా కాలం గడుపుతున్నట్లు చిట్టపూడివలస, నడుకూరు, కిమ్మి, కొట్టుగుమ్మడ ప్రాంతాల ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

డంపింగ్ యార్డులో మంటలు

పార్వతీపురం టౌన్: పట్టణంలోని రాయఘడ రోడ్డు శివారులో ఉన్న డంపింగ్ యార్డులో శనివారం రాత్రి మంటలు చెలరేగాయి. దీంతో అంతర్ రాష్ట్రీయ రహదారితో పాటు పరిసర ప్రాంతాలకు దట్టమైన పొగలు వ్యాపించడంతో ఆయా ప్రాంతాల నుంచి ప్రయాణించే వాహన చోదకులు, పరిసర ప్రాంతాల ప్రజలు, తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పొగ కంట్లో పడడంతో దారి తెలియని పరిస్థితి. అలాంటి సమయంలో ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు.


డంపింగ్‌యార్డులో రాజుకుంటున్న పొగ

ప్రజాగొంతుకైన రమాప్రభను గెలిపించండి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

పెద్దల సభలో ప్రజాగొంతుకై ప్రజా సమస్యలను చట్టసభల్లో ప్రజావాణి వినిపిస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీలు, సంఘాలు బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని సిఐటియు ఉపాధ్యక్షులు రెడ్డి వేణు పిలుపునిచ్చారు. మండలంలోని సూడిగాం, బందలుప్పిలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, కార్మిక, కర్షక, ఉపాధ్యాయ సంఘాలు బలపర్చిన పట్టభద్రుల అభ్యర్థి పెద్దల సభకు తొలిత మహిళా పట్టభద్రుల అభ్యర్థిగా పోటీ చేయడంతో మంచి ఆదరణ లభిస్తుందన్నారు. డాక్టర్ రమాప్రభ సామాజిక కార్యకర్తగా ప్రజల్లో ఉంటూ ప్రజలకు ఆర్థిక, సామాజిక చైతన్యాన్ని కలిగిస్తూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నారన్నారు. పాలక, ప్రతిపక్ష పార్టీ అభ్యర్థుల గెలుపుకై ప్రలోభాలు చూపి వేయించుకొని గెలిచిన మరుక్షణమే వారి వ్యాపార అభివృద్ధిపై దృష్టి మల్లుతుందో తప్ప, నిరుద్యోగ, ఉద్యోగుల, ప్రజా సమస్యలు వారికి కనబడవన్నారు. అందుకనే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ రమాప్రభకు ఓటేసి వెనుకబడ్డ ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధనకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు ఎస్.పోలినాయుడు, నాగేశ్వరరావు, రాము తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంటౌన్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించి శాసనమండలికి పంపించే బాధ్యత మీదేనని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణ కమిటీ సభ్యులు పట్టణ పరిధిలో ఉన్న పట్టభద్రులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఇళ్లకు వెళ్లి ఉద్యోగ, ఉపాధ్యాయ, పట్టభద్రుల, ప్రజా సమస్యలపై ప్రశ్నించేందుకు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించి శాసనమండలికి పంపించాలని ప్రచారం చేశారు. ప్రచార కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పాకల సన్యాసిరావు, సంఛాని ఉమామహేశ్వరరావులతో పాటు ఆయా వీధిపెద్దలు పాల్గొన్నారు.

సూడిగాం, బందలుప్పిలో ప్రజాసంఘాల ప్రచారం


సూడిగాంలో ప్రచారం చేస్తున్న రెడ్డి వేణు, ప్రజాసంఘాల నాయకులు

సీతానగరం : ఎమ్మెల్సీ పట్టభద్రుల అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ మద్దతుగా సీతానగరం, పెదబోగిలిలోని సుశంకరవీధిలో ప్రజా సంఘ నాయకులు జి.వెంకటరమణ, ఆర్.ఈశ్వరరావు, లక్ష్మునాయుడు ఆదివారం పట్టభద్రుల ఓటర్లను కలిసి పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి ప్రజా సమస్యలపై గొంతు విప్పి మాట్లాడే వ్యక్తి అని, గత 20 ఏళ్లుగా అనేక సంస్థల్లో పనిచేసిన వ్యక్తిని అన్నారు. అటువంటి వ్యక్తిని ఎమ్మెల్సీగా పంపితే ప్రజల వాణి వినిపిస్తారన్నారు.

పట్టుబడిన వాహనాల వేలం

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని అక్రమంగా నాటుసారా తరలింపులో పట్టుబడ్డ వాహనాలను కోర్టు ఆదేశాల మేరకు సోమవారం వేలం వేయనున్నట్లు ఎస్ఐ షైదిరాజు తెలిపారు. ఒక ఆటోతో పాటు 14 ద్విచక్ర వాహనాలను కూడా వేలం వేయనున్నట్లు ఆయన తెలిపారు. ఔత్సాహికులు సోమవారం ఉదయం 10 గంటలకు పోలీస్ స్టేషన్‌లో వివరాలు అందజేయాలని ఆయన తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు నిర్ణీత ధరావత్తు చెల్లించాలని ఈ సందర్భంగా వెల్లడించారు.

పార్కుల్లో పర్యాటక సందడి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్కులో పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం సెలవుదినం కావడంతో పర్యాటకులు పార్కు తరలివచ్చారు. పార్కులోని అందాలను ఆశ్వాదించారు. యువకులు బోటు షికారు చేశారు. యువతీ యువకులు హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్లారు. ఆనంద్ విహార వద్ద దాన్సులు వేశారు. చిన్నారులు మినీ ట్రైను నడుపుకుంటూ చిల్డ్రన్ పార్కులో అల్లరి చేశారు. పలువురు గన్ షాట్ చేయగా, సాహస పేతమైన క్రీడల్లో పాల్గొన్నారు. అనంతరం మెట్టు గూడ జలపాతాన్ని సందర్శించారు.

పోలీస్‌స్టేషన్‌లో డిఎస్‌పి తనిఖీలు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక పోలీసు స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా పాలకొండ డిఎస్‌పి జివి కృష్ణారావు ఆదివారం తనిఖీ చేశారు. రికార్డులను, ఇతర ఫైళ్లను పరిశీలించారు. అనంతరం పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే సిబ్బందిని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మహిళా కానిస్టేబుళ్లకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో నాటుసారా విక్రయాలు, తయారీ నియంత్రణకు కృషి చేయాలన్నారు. ఇందుకు సంబంధించిన ముందస్తు సమాచారం రాబట్టేందుకు కృషి చేయాలని సూచించారు. ఆ తర్వాత ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించి రోడ్డు భద్రతను పాటించాలని, ఎక్కువ మంది ప్రయాణికులతో ప్రయాణించరాదని సూచించారు. అనంతరం స్థానిక బాలురు గురుకుల కళాశాలలో జరిగిన వీడ్కోలు సభకు హాజరై విద్యార్థులకు రోడ్డు భద్రత, మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించారు. విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని, ఆ దిశగా కృషి చేయాలని సూచించారు. బాగా చదివి కాలేజీకి, తల్లిదండ్రులకు మంచి పేరు, గుర్తింపు తీసురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాలకొండ సిఐ కె.మురళీధర్, స్థానిక ఎస్ఐ ఎ.నీలకంఠరావు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డిఎస్‌పి కృష్ణారావు


సమావేశంలో మాట్లాడుతున్న మధ్యాహ్న భోజన కార్మికసంఘం జిల్లా కార్యదర్శి శాంతికుమారి

మధ్యాహ్న భోజన కార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - పాచిపెంట

మధ్యాహ్న భోజన కార్మికులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని ఎపి మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి వై.శాంతికుమారి కోరారు. ఆదివారం మండల కేంద్రమైన పాచిపెంటలో సంఘం మండల కమిటీ సమావేశం మండల ఉపాధ్యక్షులు రామకోల అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ రాజకీయ వేధింపులు మానుకోవాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పాత పద్ధతిలోనే మెనూ అమలయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు. పిల్లలకు వేడివేడి అన్నం భోజనం అందిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులను ప్రభుత్వాలు చిన్నచూపు చూడడం మానుకోవాలన్నారు. యూనిఫాంలు, గుర్తింపు కార్డులు, కనీస వేతనం రూ.10వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ విద్యను కాపాడాలన్నారు. 3,4,5 తరగతుల విలీనాన్ని ఆపాలని కోరారు. వంట గ్యాసు ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. ఆరోగ్యబీమా, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. పై సమస్యల పరిష్కారానికి మధ్యాహ్న భోజన కార్మికుల పోరాటానికి అండగా ప్రజలంతా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజనకార్మికుల సంఘం మండల కార్యదర్శి జి.కళియానమ్మ, సహాయ కార్యదర్శి కుమారి, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సరిచేయరా..?

పాలకొండ రూరల్: ఇదో ప్రభుత్వ కార్యాలయం. ఇక్కడ అధికారులు ఎంత బాధ్యతగా వ్యవహరిస్తున్నారో ఈ బోర్డు చూస్తేనే అర్థమవుతుంది. బోర్డు తిరగబడి కొన్ని నెలలు గడుస్తున్నా సరిచేసే పరిస్థితి లేదు. మార్కెట్ కమిటీ యార్డ్‌గా క్యాడర్‌లో ఉన్న ఈ బోర్డు పరిస్థితి ఇలా కనిపిస్తుంది. అధికారులు కనీసం దీన్ని పట్టించుకునే పరిస్థితి లేదు. ఇంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.


తిరబడిన ఎఎంసి కార్యాలయ బోర్డు

ముమ్మరంగా వరి సాగు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో రబీ వరి సాగు ముమ్మరంగా జరుగుతుంది. మండలంలోని లక్ష్మీపురం, బుడ్డిపేట, ఏగోటి వలస, చల్లంనాయుడు వలస తదితర గ్రామాల్లో వరి సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈ సీజన్‌లో వరి పంట వేయడంలో రైతులు బిజీగా ఉన్నారు. రబీ సీజనకు ఆర్‌బికెల ద్వారా ధాన్యాన్ని సేకరించాలని రైతులు కోరుతున్నారు.

28న సిర్లి ఎల్లమ్మ జాతర

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక ఎంపిడిఒ కార్యాలయ వెనుక ప్రాంతంలో వెలిసిన సిర్లి ఎల్లమ్మ జాతర ఈనెల 28న నిర్వహిస్తున్నట్లు శ్రీ సిరి ఎల్లమ్మ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కురుపాం నెయ్యిలవీధి గర్భగుడిలో వెలసిన సిర్లి ఎల్లమ్మ తల్లిని దర్శించుకోవాలని తెలిపారు.



బిసిలకు న్యాయం చేసే వరకూ పోరాటం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

బిసిలకు న్యాయం చేసే వరకూ పోరాటం ఆగదని బిసి సంక్షేమ రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర్రావు అన్నారు. పట్టణంలోని పార్వతీదేవి ఆలయ ప్రాంగణంలో బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన ముగడ జగన్‌మోహన్‌రావు ప్రమాణస్వీకారానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన 26 జిల్లాల్లో 175 అసెంబ్లీ స్థానాలు, 25 పార్లమెంటు స్థానాల్లో బిసి సంక్షేమ సంఘం సహకారంతో రాజకీయ వికేంద్రీకరణ కొనసాగుతుందని అన్నారు. బిసి మండల సిఫార్సుల ప్రకారం బిసిలకు 34శాతం రిజర్వేషన్లు స్థానిక సంస్థ ఎన్నికల్లో అమలు కాకపోవడం విచారకరమని అన్నారు. 78ఏళ్ల భారతావనిలో ఒబిసిలు, బిసిలు ఇప్పటికే వెనుకబడి ఉన్నారన్నారు. జనాభా దామాషా ప్రకారం కొత్త సమస్య చట్ట సభల్లో బిసిలకు ఇప్పటికే న్యాయం జరగలేదని అన్నారు. తెలంగాణ, తమిళనాడు, కేరళ, ఢిల్లీ వంటి రాష్ట్రాల్లో బిసి గణనకు ఆమోదం తెలుపుతున్నా మన రాష్ట్రంలో గణన ఇంకా వెనుకంజలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మండల కమిషన్ సిఫారసుల మేరకు రాష్ట్రంలో ఉన్న బిసిలకు ప్రజాస్వామ్యబద్ధంగా న్యాయం చేయాలన్నారు. బిసిల జనాభా వివరాలను సేకరించి అందుకు అనుగుణంగా రాజకీయ, ఆర్థిక, సామాజిక వాటాలను అందించాలని అన్నారు. బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు జగన్మోహనరావు మాట్లాడుతూ బిసిల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. అనంతరం సంఘ సభ్యులు జిల్లా నూతన అధ్యక్షుడ్ని సన్మానించారు.



జగన్మోహన్‌రావుకు నియామక పత్రాన్ని అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షులు శంకరరావు

కమ్ముకున్న పొగమంచు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలో గత రెండు రోజుల నుంచి ఉదయం 7.30 వరకు పొగమంచు కురవడంతో చూపరులతో పాటు, పర్యావరణ ప్రేమికులు ఆహ్లాదం వ్యక్తం చేశారు. అయితే రోజువారి కార్యక్రమాలకు వెళ్లే పలువురు పట్టణ ప్రజలు, శ్వాస కోశ వ్యాధులు ఉన్న దీర్ఘ కాల రోగులు ఇబ్బందులుపడుతున్నారు. దీంతో పాటు వాహన చోదకులు వాహనాలకు లైట్లు వేసుకొని తమ గమ్య స్థానాలకు వెళ్లే పరిస్థితి ఏర్పడింది. ఈ ఏడాది మామిడి పూత ఎక్కువగా ఉండడంతో ఇలాగే ప్రతిరోజు పొగ మంచు కురిస్తే మామిడి పంట దిగుబడి తగ్గుతుందని రైతులు భయపడుతున్నారు.


పట్టణాన్ని ముంచిన మంచు

చెరువును బాగుచేయరా?

పాలకొండ : పట్టణంలో రాయుడు కోనేరు పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. పూర్తిగా గుర్రపుడెక్కలతో కప్పిపోవడం వల్ల చెరువు రూపం కోల్పోయింది. గతంలో పలు వీధులకు ఇదో జీవనాధారంగా ఉండేది. పైపులైన్లు రాకముందు ఈ నీటినే పలువీధుల ప్రజలు తాగేవారు. అంతటి ప్రాధాన్యత ఉన్న చెరువును గాలికి వదిలేశారు. నగర పంచాయతీ పరిధిలో ఉన్న ఈ చెరువును పూర్తిగా పట్టించుకోవడం మానేశారు. దీంతో పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ చెరువును వినియోగంలోకి తీసుకువస్తారని భావించినప్పటికీ అటువంటి చర్యలు తీసుకొనే దాఖలాలు లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


గుర్రపుడెక్కలతో నిండిన రాయుడుకోనేరు

టిడి పారాపురంలో నీటి కష్టాలు

సొంత ఖర్చుతో నిర్మించుకున్న బోర్లు

ప్రజాశక్తి- పాలకొండ రూరల్

మండలంలో బెజ్జి పంచాయతీ పరిధిలో టిడిపారాపురంలో గత కొంతకాలంగా నీటికష్టాలు తప్పడం లేదు. పూర్తిగా ఆ గ్రామానికి ప్రభుత్వం నీటిసరఫరా చేయకపోవడంతో ప్రజలే సొంత ఖర్చుతో బోర్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. కనీసం రక్షిత మంచినీటి పథకంగానీ, వాల్‌గానీ లేకపోవడంతో ప్రజలు బోర్లపైనే ఆధారపడుతున్నారు. గ్రామంలో సుమారు 400 మంది నుంచి 500 మంది వరకు జనాభా ఉన్నారు. అయితే ఐదు బోర్లు ఉన్నా ఒక్కబోరే పనిచేస్తుంది. మిగిలిన నాలుగు బోర్లు వినియోగంలో లేకపోవడంతో ప్రజలకు నీటి ఇబ్బందులు తప్పడం లేదు. ఆర్థిక స్థోమత ఉన్నవారు సొంత ఖర్చుతో బోర్లు వేయించుకోగా, పేదల పరిస్థితి దారుణంగా ఉంది. నీటి కోసం పరుగులు పెట్టాల్సిన పరిస్థితి దాపురిస్తుంది. అధికారులు మాత్రం దీనిపై దృష్టిపెట్టిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

నీటికి ఇబ్బందులు తప్పవు : కర్నేన యోగిత....

గ్రామంలో తాగునీటి కోసం ఇబ్బందులు తప్పడం లేదు. ఏటా ఇదే పరిస్థితి. బోర్లు పాడవ్వడంతో నీటికోసం ఇబ్బందులు తప్పడం లేదు. సొంత ఖర్చుతోనే బోర్లు ఏర్పాటు చేసుకుంటున్నాం. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలి.


పాడైన బోర్లు


మాట్లాడుతున్న ఏరియా మేనేజర్ సురేష్

ప్రతి ఒక్కరు ప్రభుత్వ బీమా పరిధిలోకి రావాలి

ప్రజాశక్తి - భామిని

బ్యాంకు అకౌంట్ ఉన్న ప్రతి ఖాతాదారుడ్ని ప్రభుత్వ బీమా పరిధిలోకి తీసుకొచ్చే బాధ్యత ప్రతి ఒక్క బ్యాంకు మిత్రకు ఉంది అని ఎపిజివిబి గ్రామ తరంగ్ ఏరియా మేనేజర్ తామరసెల్లి సురేష్ తెలిపారు. ప్రభుత్వ బ్యాంకు అయిన ఎపిజివిబిలో అకౌంట్ ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పాలసీలోకి రావాలని అన్నారు. భవిష్యత్తులో ఈ పాలసీ కుటుంబ సభ్యులకు ఆసరాగా నిలుస్తుందన్నారు. క్షేత్ర స్థాయిలో పిఎంజెజెవై, పిఎంఎస్‌బివై, ఎపివై, ఎస్‌బిఐ లైఫ్ వంటి పాలసీలు, వీటివల్ల కుటుంబసభ్యులకు, బ్యాంకు ఖాతాదారులకు అవగాహన కలిగించాల్సిన బాధ్యత ప్రతి బ్యాంకు మిత్ర బాధ్యత అని సూచించారు. బ్యాంకు అందిస్తున్న వ్యవసాయ రుణాలు, బంగారంపై రుణాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్, వడ్డీపై అవగాహన కలిగించి బ్యాంకు సేవలు మీ ద్వారా మారుమూల పల్లెలకు విస్తృతపరచాలని సూచించారు. కార్యక్రమంలో 5 మండలాలకు 30 మంది సిఎస్‌పిలు పాల్గొన్నారు.